


పబ్లిషర్ అశోకరావు ఆఫీసులోకి అడుగుపెడ్తూ అక్కడ కుర్చీలో తన కోసం ఎదురు చూస్తూ కూర్చున్న రచయిత రామరాజును చూసి విష్ చేశారు. రచయితగారు ఇదివరలో కొన్ని కథల సంపుటులు, నవలలు ప్రచురింపజేశారు.

పబ్లిషర్ అశోకరావు కూడా రామరాజు నవలలు రెండు ప్రచురించడం జరిగింది గతంలో.

ఆ పరిచయంతోనే నాలుగు రోజుల క్రితం ఆ రచయిత ఇచ్చిన నవల వ్రాత ప్రతిని పరిశీలించడం తొందరగా ముగించారు అశోకరావు.

తిరిగి ఈ రోజు వచ్చిన రామరాజుకి అశోకరావు ఏదో ఒక సమాధానం చెప్పాల్సి వుంది.

"నవల చదివారా?" ఆత్రుతగా అడిగారు రామరాజుగారు. కొంచెం ఆలస్యంగా జవాబిచ్చారు పబ్లిషరుగారు.

"చదివాను"

"మరి ఎప్పటిలోగా ప్రచురిస్తారో చెప్పండి. డబ్బు చాలా అవసరంగా వుంది. మా అబ్బాయి ఆర్థికంగా చాలా ఇబ్బంది పడుతున్నాడు" అన్నారు రామరాజుగారు.

"చూడండి రామరాజుగారూ! మరోలా అనుకోకండి. మీ ఇది వరకటి నవలలకూ ఈ నవలకూ చాలా తేడా వుంది. ఎంత సాదాసీదా సహజత్వం నింపినా నాలుగు డబ్బులు వస్తాయో రావో చూసుకోవాలి కదండీ!... కనీసం పాఠకులు కోరే బలమైన మలుపులు మూడన్నా లేవు..." అన్నారు అశోకరావు.

రామరాజు డీలా పడినట్లు అన్నారు. "జీవితంలో మలుపులు చాలా ఆలస్యంగా వస్తాయి అశోకరావుగారూ! సినిమాలో మోస్తరు రెండు గంటల్లో పరిణామాలన్నీ చూపించలేం కద నవలలో. నవల అంటే జీవితానికి దర్పణం అవాలి"

"మరొకరైతే ఏమో గానీ– మీరు కాబట్టి ఈ నవల తప్పక వేస్తాను. కాని నవలలో కొన్ని మార్పులు తేవాల్సి వుంది మీరు" అన్నారు అశోకరావు.

"ఈ నవలను మరోలా మార్చడం కష్టం" అన్నారు రచయితగారు.

"ఇదివరలో మీరు వ్రాసిన నవలలకు చిన్న చిన్న సూచనలిచ్చాను. మీరు కాదనకుండా మార్చారు. ఇప్పుడు ఈ కథలో కాస్త ఎక్కువ మార్పులు చేయాలి మీరు"

"అలా కుదరదండి! ఇది నేను చాలా శ్రమపడి సహజసిద్ధంగా తీర్చిదిద్దాను."

"మీరు సహజంగా రాయలేదని ఎవరంటారండీ?– కానీ ఆలోచించండి! మీకు డబ్బు అత్యవసరంగా కావాలన్నారు కాబట్టి బాగా ఆలోచించండి..."

కొంతసేపు ఇద్దరూ దీర్ఘాలోచనలో పడ్డారు. ఆలోచిస్తున్నా తెగించి ఒక్క మాట అనలేక పోతున్నారు రామరాజు. తిరిగి అశోకరావు అన్నాడు.

"మన మధ్య వున్నది కేవలం పబ్లిషరు, రచయిత అను బంధమే అయినా హైదరాబాదు నుంచి విజయవాడకు వచ్చి నన్ను అడుగుతున్నారంటే నేను మీకు సరియైన ప్రతిఫలం ఇస్తానని మీకు తెలుసు. .."

"అవును..." అన్నారు వెంటనే

రామరాజుగారు.

"ఒక్క పని చేయండి... ఒక్క మలుపు తిప్పండి. ఆ మలుపు తోనే నవలలో అనేక పరిణామాలు వస్తాయి..."

"మలుపు తిప్పేందుకు ఆస్కారమెక్కడవుంది?"

"ఈ నవలలో పెద్దమనిషి పరంధామయ్య అల్లుని మంచితనం వల్ల చివరి క్షణంలో కొడుకుకు జ్ఞానోదయమై తల్లిదండ్రుల్ని ఆదుకునేట్టుగా చేయండి..."

"భలేవారు! అల్లుడు అకస్మాత్తుగా చనిపోయి కూతురు భారం మీద పడిన పరంధామయ్యను అల్లుడు ఎలా ఆదుకుంటాడు?- బావమరిదికి ఎట్లా జ్ఞానోదయం కలిగిస్తాడు?"

"మీరు అల్లుణ్ణి చంపకుండా వుంచాలి."

"అసంభవం!"

అశోకరావుకి రామరాజు ధోరణి కించిత్తు కోపం తెప్పించింది. అయినా అదుముకున్నారు లోలోపలే.

"పోనీ- పరంధామయ్య చిన్న కూతురును పరంధామయ్య స్నేహితుని కొడుకు వివాహం చేసుకుని కొంతవరకు కథను సుఖాంతం చేయాలి..."

"పరంధామయ్య చిన్న కుమార్తె ప్రేమించి పెళ్లి చేసుకుని వెళ్ళిపోయింది- తల్లిదండ్రుల గురించి ఆలోచించకుండా! ఇక స్నేహితుడి కుమారునితో పెళ్ళి, పరంధామయ్య సంతోషం అంతా వట్టిదే."

"మీరు ఆ అమ్మాయి వెళ్ల కుండా వుండేలా చేసి కథ నడిపించండి."

"ఆ అమ్మాయిని వెనక్కి తీసుకొచ్చి మరో సంబంధం వారిని వొప్పించడం అంత తేలికనేనా మీ ఉద్దేశం అశోకరావుగారూ!" పేలవంగా నవ్వారు రామరాజుగారు.

"ఒక స్నేహితుణ్ణి పెట్టవచ్చుగా నవలలో-"

"పరంధామయ్య దగ్గర డబ్బు తగ్గుతూ వచ్చినట్టే స్నేహితులూ తగ్గుతూ వచ్చి పూర్తిగా తప్పుకున్నారు."

అశోకరావు ఒక నిట్టూర్పు విడిచాడు. "మరి నవలలో ఒక అంశమూ ఆశాజనకంగా లేకపోయాక పాఠకులు చదువుతారని నేనెలా ఆశపడను?- అసలు ఇలాంటి ఎలాంటి కొత్తదనమూ లేని నవల మీరెలా వ్రాశారో నాకు తెలీడం లేదు."

రామరాజు కూడా తలవంచి నిట్టూర్చారు.

"ఇంక ఒక్క ముఖ్యాంశం వుంది-" అన్నారు అశోకరావు.

"ఏవిటది?" అన్నట్టు చూశారు రామరాజు.

"పరంధామయ్య కొడుకు చివరి అంకంలో పశ్చాత్తాపపడేట్టు ఆయన తన పట్టుదల సడలించుకుని ఆగిపోయినట్టు చిత్రిస్తే ఎంత మామూలు కథైనా పాఠకులు కాస్త సంతోషిస్తారేమో"

"పరంధామయ్య కొడుకు పశ్చాత్తాపపడడు. పరంధామయ్య పట్టుదల మనిషికాదు సహజంగా. అయితే పట్టుదల వస్తే మాత్రం గట్టి పట్టు పట్టేస్తాడు. అతను భార్యా సమేతంగా పక్క వూళ్ళో కాపురం పెట్టేందుకు తన సామాన్లు రవాణా చేసేశాడు కూడా"

ఎన్నో పుస్తకాలు వెలుగులోకి తెచ్చిన అశోకరావుగారి బుర్రలో మెరుపు మెరిసింది- "తెలిసింది మీరు ఎవరిదో జీవిత చరిత్ర రాశారు అవునా?" అన్నారు రామరాజు వైపు సూటిగా చూస్తూ.

రామరాజుగారు చటుక్కున లేచి నిలబడ్డారు. "నా జీవిత చరిత్ర అని తెలీడం ఇష్టం లేక నవలగానే తయారుచేశాను. ఈ పుస్తకం వల్ల మీకు లాభం లేదని తెలిసింది. వెళ్ళొస్తాను" అన్నారు వెళ్ళబోతూ.

"ఆగండి రామరాజుగారూ! ఈ నవల ప్రచురిస్తాను తప్పకుండా... ఒక్క సందేహం తీర్చండి..."

"అడగండి ఫరవాలేదు"

"ఇందాక మాటల్లో 'మా అబ్బాయికి ఇబ్బందిగా వుంది- డబ్బు అత్యవసరంగా కావాలి' అని మీరన్నారు.. మరి ఇప్పుడు మీకే డబ్బు కావాలని తెలుస్తోంది- అంతరార్థమేమిటో అని" అన్నారు అశోకరావు ప్రశ్నార్థంగా చూస్తూ.

రామరాజుగారు చిన్నగా నవ్వారు. "మేము ఇంట్లో వుండడం మా అబ్బాయికి ఇబ్బందిగా వుంది. నేను వేరే వెళ్తే వాడి ఇబ్బంది తీరుతుంది. వేరే వుండాలంటే నాకు డబ్బు కావాలి అర్జెంటుగా" అన్నారు. అని "వెళ్ళొస్తాను" అంటూ వెనుదిరిగారు.

"అడ్వాన్సు తీసుకోండి రామరాజుగారూ! మీకు డబ్బు అవసరమన్నారు గదా" అన్నారు భారంగా అశోకరావుగారు.

"మీకు నష్టమేమో..." అన్నారు సందేహంగా రామరాజుగారు.

"ఒక సహజ నవల ప్రచురించడానికి తెగిస్తున్నందుకు నాకు గర్వంగా వుంది" అన్నారు అశోకరావు, రామరాజు కళ్ళల్లో ఆనందాన్ని చూస్తూ.


మధురిమలను బంధించే మరపురాని బహుమతి

డైనాక్స్ 35 ఎం.ఎం

మీ ప్రియమైన కెమెరా

డైనాక్స్ సూపర్ డీలక్స్




35 కలర్ ఫోటోగ్రాఫ్‌ల కోసం పూర్తి ఏర్పాటుతో 35 ఎం.ఎం. హై-టెక్ కలర్ కెమేరా. మీకు అందుబాటు ధరలోనే. రూ. 450/-లు (2 సంవత్సరములు గ్యారంటీ) సంతృప్తి చెందనిచో సొమ్ము వాపసు

విశిష్టతలు:

* ఫ్లాష్ ఏర్పాటు * అన్ని వాతావరణములలోనూ ఉపయోగించడం ఎంతో సులభం * పగలని, చూడముచ్చటైన క్యాబినెట్ * పిక్‌నిక్, పార్టీ, పండుగ మరియు వివాహాది శుభకార్యములకు అనువైనది * ఎపెర్చర్ సహాయంతో దూరాన్ని సర్దుబాటుచేసుకునే విధానం.

ఫోటోగ్రఫీ వృత్తి ద్వారా నెలకు వేలాది రూపాయలు మీరూ సంపాదించండి.

Mfr. DYNAX INDIA [ B-10 ]
Bihari Ganj, AJMER - 305 008